ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 04-04-2025 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో అకాల వర్షం కారణంగా పలు పాంత్రాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

2. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి మంత్రి సీతక్క తెలిపారు.

3. వక్ఫ్ సవరణ బిల్లు పార్లమెంటు ఆమోదం పొందడంతో న్యాయం , సమాన అవకాశాల దిశగా కీలక ముందడుగు పడిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.

4. రంగారెడ్డి జిల్లా కంచ గచ్చిబౌలిలోని వివాదాస్పద భూముల విషయంలో తదుపరి కార్యాచరణపై మంత్రుల బృందంతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు.

**వర్షాలు-పంట నష్టం**

రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాల కారణంగా పలు పాంత్రాల్లో పంటలు దెబ్బతిని రైతులు నష్ట పోయారు. నిన్న ఒక్కసారిగా ఈదురు గాలులతో ప్రారంభమై ఉరుములు, మెరుపులు, పిడుగుపాట్లతో వర్షం కురవడంతో పలు పట్టణ ప్రాంతాల్లో జన జీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వర్షం నీరు చేరగా.. రోడ్లపై నీరు చేరడంతో పాటు చెట్లు విరిగిపడి ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. రాష్ట్ర వ్యాప్తంగా

పిడుగుపాట్లు, గోడకూలిన ఘటనల్లో ఐదుగురు మృతి చెందినట్టు సమాచారం. వడగళ్ల వర్షాలు, ఈదురు గాలు కారణంగా పలు జిల్లాల్లో మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. ఆకు కూరల తోటలకూ నష్టం వాటిల్లింది. వరి పంటలు నేలవలడంతో పాటు ధాన్యం రాశులు తడిసిపోయి రైతులు నష్టపోయారు. భారీ వర్షాలు కురుస్తున్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. రాష్ట్రంలో మరో మూడు రోజుల పాటు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

(డెస్క్)

**సీతక్క-ములుగు**

అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం ఆదుకుంటుందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందివ్వడంతో పాటు తడిసిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ములుగు జిల్లాలో నిన్న కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను మంత్రి ఈ రోజు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

**సౌండ్ బైట్ సీతక్క**

గోవిందరావుపేట మండలంలోని అమృతండ , లక్ష్మిపూర్, కర్లపల్లి, చంద్రుతండా గ్రామల్లోని పంటలు భారీగా దెబ్బతిన్నట్టు గుర్తించారు. వెంటనే పంట నష్టం అంచనా వేసి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు.

(PTC Mulugu)

తుమ్మల-పంట

కాగా, రాష్ట్రంలో నిన్నటి నుంచి కురుస్తున్న అకాలు వర్షాలు , వడగళ్లకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి నివేదిక అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్లలోకి వచ్చిన పంట ఉత్పత్తులను జాగ్రత్తగా కాపాడాలని సూచించారు.

(డెస్క్)

**ఆసిఫాబాద్ -వర్షాలు**

ఆసిఫాబాద్ జిల్లాలో నిన్న రాత్రి కురిసిన వర్షానికి మొక్కజొన్న, మిర్చి పంటల దెబ్బతినడంతో పట్ల ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో సగటున మూడు మిల్లీమీటర్ల వర్షపాతం కువవగ అత్యధికంగా కెరమెరిలో ఆరు మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

వక్ఫ్ బిల్లు-బండి సంజయ్

పార్లమెంటు ఉభయ సభలలో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందడంతో న్యాయం , సమాన అవకాశాల దిశగా కీలక ముందడుగు పడిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఎన్నో ఏళ్లుగా వక్ఫ్ వ్యవస్థలో పారదర్శకత లోపించిందని , ఇది పేద ముస్లింలు , పస్మాండ వర్గాలు , ముస్లిం మహిళల హక్కులను దెబ్బతీసిందని అభిప్రాయపడ్డారు. కొత్త చట్టాలు ఇప్పుడు పారదర్శకతను తీసుకువచ్చి , ప్రజల హక్కులను కాపాడతాయని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ , హోం శాఖ మంత్రి అమిత్ షాకు సంజయ్ కుమార్ క్రుతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సంస్కరణలు చివరకు వాస్తవమవుతున్నాయని అన్నారు.

(డెస్క్)

**పొన్నం ప్రభాకర్**

ప్రతి రోజు జరుగుతున్న జాతీయ , అంతర్జాతీయ అంశాలపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఈరోజు సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలో కోహెడ మండలం నాగ సముద్రాల మోడల్ స్కూల్ లో మహాత్మా గాంధీ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. అదే విధంగా విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వారితో కలిసి భోజనం చేశారు. జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ విగ్రహాల నుంచి స్ఫూర్తి పొందాలని, గ్రామాల్లో జై బాపు- జై భీమ్ -జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేస్తున్నామని తెలిపారు.

(సిద్దిపేట జిల్లా పీటీసి)

**బీజేపీ-ఎమ్మెల్సీ అభ్యర్థి**

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా ఎన్.గౌతమ్ రావును ఆ పార్టీ ప్రకటించింది. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా గౌతమ్ రవు పనిచేశారు. మే 1తో ఎమ్మెల్సీ ప్రభాకర్ పదవీకాలం ముగియనుంది. దీంతో ఈ స్థానానికి ఈ నెల 23న ఎన్నిక జరగనుంది. ఈ నెల 25న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

(పీఎన్)

**భద్రాచలం-ట్రైబల్ మ్యూజియం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో 50 లక్షల రూపాయల ఖర్చుతో చేపట్టిన ట్రైబల్ మ్యూజియం ఆధునీకరణ పనులు పూర్తి కావచ్చాయి. శ్రీరామనవమికి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఈ మ్యూజియంపై ఆకాశవాణి ప్రతినిధి హరిక్రుష్ణ అందిస్తున్న మరన్ని వివరాలు

(వాయిస్ కాస్ట్- హరిక్రుష్ణ)

(PTC- B.KGM)

**మంత్రుల కమిటీ**

రంగారెడ్డి జిల్లాలో కంచ గచ్చిబౌలి వివాదస్పద భూముల విషయంలో తదుపరి కార్యాచరణపై మంత్రుల బృందంతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి ఎ . రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. కంచ గచ్చిబౌలి భూ సమస్యల పరిష్కారం దిశగా ఈ కమిటీ హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం కార్యనిర్వాహక కమిటీ , జేఏసీ, పౌర సమాజ సమూహాలు , విద్యార్థుల ప్రతినిధి బృందంతో , అలాగే సంబంధిత వాటాదారులు అందరితోనూ సంప్రదింపులు జరుపుతుందని ముఖ్యమంత్రి సామాజిక మాధ్యమం ఎక్స్ లో పేర్కొన్నారు.

(డెస్క్)

వరంగల్ చపాట మిర్చి-రైతుల సంతోషం

వరంగల్ జిల్లాలోని దుగ్గొండి మండలంలో రైతుల వారసత్వ పంట అయిన చపాట మిర్చికి భౌగోళిక సూచిక -జీఐ ట్యాగ్ ధ్రువపత్రం లభించి న విషయం తెలిసిందే. దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామం మిరప రైతులు దీనిపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా చపాట మిర్చికి డిమాండ్ పెరుగుతుందని చపాట మిరప సాగు చేస్తున్న రైతు రాజ్ కుమార్ రెడ్డి ఆకాశవాణి తెలిపారు

(సౌండ్ బైట్ : రాజ్ కుమార్ రెడ్డి చపాట మిర్చి రైతు)

వరంగల్ జిల్లా పి టి సి

**CCMB- Sickle Cell Anemia:**

రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సికెల్ సెల్ అనీమియా ముందస్తు గుర్తింపు పరీక్షలు- స్క్రీనింగ్ చేపట్టే అవకాశం ఉందని CSIR- CCMB శాస్త్రవేత్తలు చెప్పారు. స్థానికంగా గిరిజన సంక్షేమం కోసం కృషి చేస్తున్న సంస్థలతో ఇప్పటికే చర్చించినట్లు , త్వరలో స్క్రీనింగ్ చేపట్టే అవకాశం ఉందన్నారు. CSIR- CCMB డైరెక్టర్ డాక్టర్ వినయ్ K నందుకూరి, సికెల్ సెల్ అనీమియా శాస్త్రవేత్త డాక్టర్ GR ఛాండక్ ఈరోజు హైదరాబాద్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

(MSL)

**దామోదర్ రాజనర్సింహ**

సంగారెడ్డి జిల్లాలో ప్రజలకు వైద్యం మరింత అందుబాటులో తెచ్చేందుకు సంగారెడ్డి మెడికల్ కళాశాల, ఆందోల్ నర్సింగ్ కళాశాలలోని హాస్టళ్ల నిర్మాణ పనులు వెంటనే పూర్తిచేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల కోసం తోషిబా ఇండస్ట్రీస్ కొనుగోలు చేసిన బస్సును మంత్రి ఈరోజు ఉదయం జెండా ఊపి ప్రారంభించి కళాశాలకు అందజేశారు.

(పీటీసీ, సంగారెడ్డి)

నల్లగొండ-కోమటి రెడ్డి

వైద్య విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు తమ తొలి ప్రాధాన్యత గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ ఆసుపత్రులకు ఇవ్వాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సూచించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో నిన్న 2019-25 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థుల స్నాతకోత్సవంలో పాల్గొని పట్టాల పంపిణీ చేశారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తూ వ్యక్తి గత గుర్తింపుతో

పాటు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎంబీబీఎస్ పట్టా మాత్రమే కాదని, ప్రజల ప్రాణాలను కాపాడే ఆయుధమన్నారు.

(పిటిసి, నల్లగొండ జిల్లా)

సిరిసిల్ల-ఎస్పీ

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గంజాయి అక్రమ రవాణా చేసినా , విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ మహేష్ బి గితే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అన్ని శాఖల సమన్వయంతో తాము ముందుకు వెళ్లి జిల్లాలో గంజాయి , డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

(పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా)

వర్షాలు-సీఎం రివ్యూ

అకాల వర్షాల వల్ల హైదరాబాద్ నగరంలో ఉత్పన్నమైన పరిస్థితులను ఎదుర్కొనడానికి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నిన్న భారీ వర్షంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం , ఈదురుగాలుల కారణంగా తలెత్తిన పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా తక్షణ సహాయక చర్యల కోసం అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. నగరంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జలమయమైన కాలనీల్లో ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అన్నారు.

పలు జిల్లాల్లో కూడా వర్షాలు , ఈదురుగాలులు, వడగండ్లు పడుతున్నందున జిల్లా కలెక్టర్లు, పోలీసు యంత్రాంగం , ఇతర అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

(డెస్క్)

ఆసిఫాబాద్ -ఉపాధి కూలీల రాస్తారోకో

ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఉపాధి హామీ కూలీలు తమకు పని కల్పించాలంటూ జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఈ ఉదయం రాస్తారోకో నిర్వహించారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా ప్రకటించిన తర్వాత తమ జాబ్ కార్డులు తొలగించారని , దీనితో పని దొరకక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)